సతీష్‌కు దళితరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న సతీష్

అత్తాపూర్: హైదర్‌గూడకు చెందిన సంఘ సేవకుడు జావాజ సతీష్‌కు దళితరత్న అవార్డు లభించింది. ఆయన చేస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని దళితరత్న అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ... తాను చేసే సేవా కార్యక్రమాలను గుర్తించి దళితరత్న అవార్డు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. రానున్న రోజుల్లో మరింత కృషిపడి తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని వెల్లడించారు.

'ఎర్లీబర్డ్'ను సద్వినియోగం చేసుకోవాలి

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ డాక్టర్ రవికుమార్ కోరారు. గురువారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఈ నెల 30వ తేదీ వరకు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ అందిస్తుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నులో ఈ 5 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ పథకం ద్వారా ఆస్తిపన్ను చెల్లింపుదారులు ఆస్తిపన్ను చెల్లించి రాయితీ పొందాలన్నారు. సర్కిల్ పరిధిలోని ఆస్తిపన్ను చెల్లింపుదారులు తమ ఆస్తిపన్నును ఆన్‌లైన్‌ల ద్వారా చెల్లించవచ్చన్నారు. ఆన్‌లైన్ ద్వారా లేదా తమ ఇంటి వద్దకు వచ్చే బిల్ కలెక్టర్లు తదితరులకు చెల్లించాలన్నారు. ప్రస్తుతం సర్కిల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని.. వీటి ద్వారా తమ ఆస్తిపన్నును చెల్లించాలన్నారు. ఆయా కౌంటర్లలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆస్తిపన్నును చెల్లించవచ్చని ఆయన పేర్కొన్నారు.

పెద్దతూప్ర గ్రామాన్ని సందర్శించిన ఎన్‌ఐఆర్‌డీ బృందం



పెద్దతూప్ర గ్రామాన్ని సందర్శించిన ఎన్‌ఐఆర్‌డీ

శంషాబాద్: జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్‌ఐఆర్‌డీ)లో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాలకు చెందిన గ్రామీణ పరిపాలన ఉద్యోగులు గురువారం పెద్దతూప్ర గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న పల్లె ప్రకృతి వనాల పెంపకాన్ని పరిశీలించారు. గ్రామాభివృద్ధి తీసుకుంటున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మున్ని, మాజీ ఎంపీపీ జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేస్తున్న వ్యక్తిపై కేసు

దబీర్‌పురా: నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదైన ఘటన మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్, ఎస్సై అరుణోదయ తెలిపిన వివరాల ప్రకారం .. నూర్‌ఖాన్‌బజార్‌కు చెందిన షేక్ ఖయ్యూమ్ నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్‌ను తయారు చేస్తూ స్థానిక దుకాణదారులకు సరఫరా చేస్తున్నాడు. దీనిపై విశ్వసనీయమైన సమాచారం అందుకున్న మీర్‌చౌక్ పోలీసులు దాడులు చేసి 300 లీటర్ల నకిలీ కాస్ట్రోల్ ఇంజన్ ఆయిల్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నారు. లాన్సర్ నెట్‌వర్క్ ప్రైవేటు లిమిటెడ్ సీనియర్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ శశిధర్ రావు ఫిర్యాదు మేరకు పోలీసులు షేక్ ఖయ్యూమ్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గణేషుడికి బెల్లంతో అభిషేకం



రాయదుర్గం: సంకష్ట హర చవితిని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివ సాయిక్షేత్రంలో గణేషుడికి ప్రత్యేక పూజలను గురువారం నిర్వహించారు. ఆలయ అర్చకులు మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య గణేషుడికి బెల్లంతో ప్రత్యేక అభిషేకం, తమలపాకుల హారంతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం షిరిడీ సాయిబాబా, కాశీవిశ్వేశ్వర స్వామి, అన్నపూర్ణాదేవి, ఆంజనేయ స్వామిలకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, అలంకారం చేశారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సన్న బియ్యానికి భలే డిమాండ్

- పెద్ద ఎత్తున తీసుకుంటున్న లబ్ధిదారులు
- రేషన్ షాపుల్లో వారం రోజుల్లోనే నో స్టాక్
- సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు
- రెండో విడత స్టాక్ కోసం ఎదురు చూపులు



మంచిరేవులలోని రేషన్ షాపు

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న సన్న బియ్యానికి ఫుల్ డిమాండ్ ఏర్పడింది. సన్న బియ్యం ఇస్తున్న విషయం ముందుగానే తెలియటంతో మొదటి రోజు నుంచే ప్రజలు రేషన్ షాపులకు వచ్చి తీసుకెళ్లారు.

◆ గండిపేట మండల పరిధిలో 26 రేషన్ షాపులలో తెల్లరేషన్ కార్డులు 15,603 కార్డులు, 422 అంత్యోదయ కార్డులు ఉన్నాయి. వారికి ప్రతి నెల 3,41,910 కేజీల బియ్యంను సరఫరా చేస్తున్నారు. ఈ నెల నుంచే సన్న బియ్యం పంపిణీని మొదలు పెట్టడంతో స్టాక్ వచ్చిన ఐదు నుంచి వారం రోజుల్లోనే అన్ని గ్రామాలలో అయిపోయింది. రెండవ విడత స్టాక్ కోసం రేషన్ డీలర్‌లతో పాటు లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. గతంలో రేషన్ కార్డులపై దొడ్డు బియ్యం ఇవ్వటంతో సగం మందికి పైగా వాటిని తీసుకునేందుకు ఆసక్తి కనబర్చేవారు కాదని డీలర్లు పేర్కొంటున్నారు. కొంత మంది మాత్రమే వండుకుని తినే వారని, మరికొంత మంది ఇడ్లీలు, దోశలకు వాటిని వినియోగించే వారన్నారు. అలాంటి ఇపుడు ప్రజలందరికీ సన్న బియ్యంపై ఆసక్తి నెలకొని ప్రతి ఒక్కరూ షాపులకు వచ్చి వాటిని తీసుకెళ్తున్నారన్నారు. ఇప్పటికే సన్న బియ్యం తీసుకుని వండుకుని తిన్న వారు అవి బాగున్నాయని, అన్నం బాగా అవుతోందని సదభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

◆ ఇన్నాళ్లకు ప్రజలకు అవసరమైన మంచి పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పేదలకు అవసరమైన నిత్యావసరాలు, విద్య, వైద్య రంగాలలో ప్రజలకు ఉపయోగపడేలా పథకాలను అందిస్తే ప్రభుత్వానికి మరింత పేరు వస్తుందంటున్నారు.

డీలర్ల సమస్యలు తీర్చాలి



గోదాములలో క్వింటాలు బియ్యానికి 2 నుంచి 5 కిలోల వరకు తరుగు వస్తుంది. కమీషన్ క్వింటాలుకు రూ. 140 మాత్రమే ఇస్తున్నారు. ఇలాంటి సమస్యలతో డీలర్లకు పెద్దగా గిట్టుబాటు కావటం లేదు. ప్రస్తుతం సన్న బియ్యం ఇస్తుండటంతో మాకు పనిభారం పెరిగింది. గతంలో తీసుకోని వారు సైతం వచ్చి సన్న బియ్యం తీసుకుంటున్నారు. తరుగు లేకుండా బియ్యం ఇవ్వటం, కమీషన్‌ను రూ. 200లకు పెంచాలని కోరుతున్నాం. – వెంకటేష్, డీలర్, మంచిరేవుల

తీసుకెళ్తున్నారు



రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తున్నారనే విషయం తెలుసుకుని ప్రజలు మొదటి రోజు నుంచే ఎగబడి తీసుకెళ్లారు. నాలుగు రోజుల్లోనే స్టాక్ అయిపోయింది. తీసుకున్న బియ్యం బాగున్నాయి. గతంలో ఇచ్చే దొడ్డు బియ్యం సైతం తినేవాళ్లము. ఇపుడు సన్న బియ్యంతో కొంత అన్నం ఎక్కువగానే తింటున్నాము. – మధుకుమార్, నార్సింగి

మంచి పథకం



రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇచ్చే పథకం పేదలందరికీ ఉపయోగపడుతుంది. అంత లావుగా, సన్నగా లేకుండా బియ్యం ఉన్నాయి. అన్నం మంచిగా అవుతుంది. పిల్లలు, పెద్దలు హాయిగా తింటున్నారు. ఇదే తరహాలో ప్రభుత్వ వైద్యం, విద్యలను ప్రజలందరూ వినియోగించుకునేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేస్తుందని ఆశిస్తున్నాము. – మహ్మద్ ఖాసీం, నార్సింగి

బియ్యం బాగున్నాయి



రేషన్‌షాపులో ఇస్తున్న సన్న బియ్యం బాగున్నాయి. వచ్చిన బియ్యం నాలుగు రోజుల్లోనే అయిపోయాయి. మళ్లీ తెప్పించి డీలర్ ఇస్తున్నాడు. దొడ్డు బియ్యం తినేందుకు కొందరు నామోషీ అనుకునే వారు. ఇపుడు సన్న బియ్యం అనటంతో ఎగబడి తీసుకుని వెలుతున్నారు. బియ్యంలో నూకలు ఏమి లేవు. ఇంతకు ముందు కంటే ఒక ముద్ద ఎక్కువనే తింటున్నాను. – కళావతి, మంచిరేవుల

నీటి సమస్యలపై బీజేపీ ధర్నా రేపు



మాట్లాడుతున్న బీజేపీ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన రాజేంద్రనగర్‌లోని జల మండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. కాటేదాన్‌లోని బీజేపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లోప్రెషర్‌తో పాటు సరపడా నీటిని సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనికితోడు అన్ని డివిజన్లలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తున్నదన్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ లైన్లు, వాటర్ లైన్‌లు ఒకే చోట ఉండటంతో మురికి నీరు మంచి నీటిలోకలుస్తూ కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. అధికారులు వీటిని పట్టించుకోకుండా ఆఫీసు రూమ్‌లలో ఉంటున్నారన్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సర్కిల్ వాటర్ వర్క్స్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య, జోగి రవి, కాడెం సుధాకర్, అడికే రాజు, డి. సత్యనారాయణ, సోల్కర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఎస్.జగన్, రావుల భాస్కర్, రాచూరి రాజశేఖర్, అడికే జనార్ధన్, ఎస్.విజయ్‌కుమార్, జి.బాబురావు, నిఖిల్, ఎస్.వెంకటేష్, బుచ్చిరెడ్డి, వెంకటరమణ గుప్తా, బొమ్మరాజు నర్సింహా, మధుసూదన్‌రెడ్డి, ఎడ్లకాడి రవి తదితరులు పాల్గొన్నారు.

20న మియాపూర్ రన్

గచ్చిబౌలి: తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మియాపూర్ రన్ 2వ ఎడిషన్ ఏప్రిల్ 20 నిర్వహించనున్నారు. మియాపూర్ లింక్ రోడ్డులో 10కే, 5కే, 5కే ఫన్ రన్‌లను నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రన్ ప్రారంభమవుతుంది. ఫన్ రన్ కోసం రూ. 300, 5కే రన్ కోసం రూ. 500, 10కే రన్ కోసం రూ. 700 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వికలాంగులైన చిన్నారుల కోసం ఫండ్ రైజింగ్ నిమిత్తం ఈవెంట్ నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు ఫోన్స్: 83675 81378, 98494 93010లలో సంప్రదించవచ్చు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ..యాక్సెస్ ఫౌండేషన్ వారు విజన్ డ్రైవ్‌లో భాగంగా గత నెలలో మొదటి ఉచిత వైద్య కంటి పరీక్ష శిబిరం నిర్వహించారన్నారు. అందులో వైద్య పరీక్షలు నిర్వహించిన వారిలో పలువురికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్స విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా కళ్లద్దాలు అవసరమైన వారికి యాక్సెస్ ఫౌండేషన్ వారు కంటి అద్దాలు ఉచితంగా ఇచ్చారన్నారు. మొత్తం రెండు శిబిరాల్లో 200 మందికి రూ.40 వేల విలువ చేసే కంటి అద్దాలను పంపిణీ చేశారని ఆమె తెలిపారు. కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు కూడా కంటి పరీక్షలు నిర్వహించుకున్నారన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



మణికొండ: ఔటర్ రింగ్ రోడ్డుపై కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోకాపేట టోల్ ప్లాజా సమీపంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అప్పా జంక్షన్ నుంచి పటాన్‌చెరువు వైపు వెళుతున్న కారు కోకాపేట టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డుపై అడ్డుగా వచ్చిన వ్యక్తిని ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేదలపై చలానాలు విధిస్తే సహించం



మోంద్ర సంగీత, కార్పొరేటర్

అత్తాపూర్: గత్యంతరం లేని పరిస్థితుల్లో నల్లాలకు మోటార్లు బిగించే పేదలపై సంబంధిత అధికారులు చలానాలను విధిస్తామని హెచ్చరించడంపై అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోంద్ర సంగీతగౌరీశంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లాలో నీరు ఎందుకు కొద్ది సేపే వస్తుందని లైన్‌మెన్‌లను అడిగితే వారు దురుసుగా ప్రవరిస్తూ రిజర్వాయర్లలో వాటర్ లెవెల్స్ చాలా తక్కువగా ఉన్నందున రావడం లేదంటున్నారు. ఎన్ని నీళ్లు వదిలితే మేము అంతే సప్లై ఇస్తామని దురుసుగా సమాధానాలు చెబుతున్నారన్నారు. గంటపాటు సరఫరా చేస్తే ఎవరికీ ఈ పరిస్థితి రాదన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు సక్రమంగా సప్లై జరుగుతుందా లేదా అని ఎప్పటికప్పుడు పర్యటిస్తే ఇలాంటి పరిస్థితి రాదన్నారు. ఇదిలాగే కొనసాగితే కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్‌లో పుట్టగతులు ఉండవన్నారు. అధికారులు సక్రమంగా విధులు నిర్వహించి పేదవారికి గుక్కెడు మంచినీళ్లు అందించి ఎవరికి తగినన్ని మంచినీళ్లు అందతున్నాయిలేదా అని చూడాలన్నారు. బడాబాబులకు ఈ సమయంలో ఎండాకాలం దృష్టిలో ఉంచుకొని బల్క్ సప్లైలో ఎందుకిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఖజానాకు పేదవాళ్లను దోచుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. పేదవారంటే ఇంత నిర్లక్ష్యమా, ప్రభుత్వ ఖజానాకు మిగులు లేకపోతే ఇంకేమైనా బడాబాబుల పైన పెత్తనం చెలాయించి మీ ఆదాయం పెంచుకోండి కానీ అసలే మోటార్ పెడితే కానీ చుక్క మంచినీళ్లు రాని పేద వారిపై మీ పెత్తనం చెలాయిస్తే సహించమని ఆమె హెచ్చరించారు.

గుడిమల్కాపూర్‌లో బీజేపీ నేతల పాదయాత్ర



గుడిమల్కాపూర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకుడు అమర్‌సింగ్ తదితరులు

గోల్కొండ: బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రధాని మోదీ సాధించిన విజయాలు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిని ప్రజలకు వివరించారు. గచ్చిబౌలి కంచ భూములను అమ్మేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో ఉత్సాహం చూపారని అయితే సుప్రీంకోర్టు ముఖ్యమంత్రి వైఖరికి తీవ్రంగా విమర్శించి ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిందన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు, నిరుపేద ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. ఆయన వెంట బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్, కట్ల అశోక్, జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.

ఇందిరమ్మ కమిటీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు

శంషాబాద్: అర్హులైన వారిని గుర్తించడంలో ఇందిరమ్మ కమిటీల పాత్ర కీలకమైందని శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 31 ఇందిరమ్మ కమిటీల సమన్వయ సమావేశాన్ని పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక తీరుతో పాటు స్లాబ్ విధానంలో లబ్ధిదారులకు అందే మొత్తాన్ని వివరించారు. ప్రస్తుం స్థలం ఉండి ఇళ్లు కట్టుకోలేని నిరుపేదలను మాత్రమే ఈ పథకం ద్వారా ఎంపిక చేసి వారి నిర్మాణాలకు అనుగుణంగా స్లాబ్ విధానంలో విడతల వారిగా రూ. 5 లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ శ్రావణి, ఆయా వార్డుల మాజీ కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పటిష్టతపై దిశానిర్దేశం



హరీష్‌రావును సన్మానిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో బీఆర్‌ఎస్ పార్టీని మరింత పటిష్టం చేయడంపై మాజీ మంత్రి హరీష్‌రావు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. డివిజన్‌కు చెందిన సీనియర్ నాయకుడు కొంపల్లి జగదీష్ ఆధ్వర్యంలో గురువారం హరీష్‌రావును నగరంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అనుసరిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యక్రమాలను చర్చించారు. స్పందించిన హరీష్‌రావు మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పని చేయాలని సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి లాంటి కీలక డివిజన్‌లో పార్టీ కార్యకలాపాలు మరింత విస్తృతంగా కొనసాగించాలన్నారు. రాష్ట్రంలో తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి తీసుకొచ్చేందుకు పార్టీ శ్రేణులందరూ సంఘటితంగా ముందడుగు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో నేతలు డి.వెంకటేష్, సంతోష్ శెట్టి, కష్టముదిరాజ్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై సంతలను తొలగించండి



నార్సింగి ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న 'గర్వ' ప్రతినిధులు

మణికొండ: నిత్యం ఏదో ఒకప్రాంతంలో రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వారాంతం సంతలు నిర్వహిస్తుండటంతో రాకపోకలు సాగించే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది అవుతున్నదని, వారు చెల్లించే తైబజార్‌తో రోడ్లపై ఆక్రమణలు వెలుస్తున్నాయని వాటిని పూర్తిగా తొలగించాలని నార్సింగి పోలీస్ ఇన్‌స్పెక్టర్‌ను గ్రేటర్ అలకాపూర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ (గర్వ) నాయకులు కోరారు. గురువారం వారు నార్సింగి లా అండ్ ఆర్డర్ , ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లలో ఇన్‌స్పెక్టర్‌లు హరికృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సలహామండలి సభ్యుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ... వారాంతపు సంతల రూపంలో రోడ్లపై సంతలను నిర్వహిస్తున్నారన్నారు. వాటితో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. కోట్ల రూపాయల ఆదాయం ఉన్న మున్సిపాలిటీలలో ఓ మార్కెట్‌ను ఒక చోట ఏర్పాటు చేయకుండా ప్రజలకు ఇబ్బంది కలిగేలా సంతలను ఏర్పాటు చేసి వాటి నుంచి తై బజార్‌లు వసూలు చేస్తూ రోడ్ల ఆక్రమణలను ప్రోత్సహిస్తున్నారన్నారు. అలాంటి వాటిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలకు వాటిని ఏర్పాటు చేయవద్దని లేఖలు రాయాలని కోరామన్నారు. కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలలో నేరాలు జరగకుండా మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాల్లో పోలీస్ పెట్రోలింగ్‌ను పెంచాలని, భద్రతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరామన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు సుదేశ్‌కుమార్, సలహా మండలి సభ్యుడు నీలేష్‌ప్రసాద్, ఉపాధ్యక్షులు దిలీప్, కిరణ్, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వానం

బీఆర్‌ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం



సమస్యలు తెలుసుకుంటున్న సీతారాం

మణికొండ: పలు కాలనీలలో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని... పారిశుద్ధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండటం తగదని బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి. సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమాన్ని లాలమ్మ గార్డెన్, శ్రీరాంనగర్ కాలనీలలో పార్టీ నాయకులతో కలిసి నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ... ఆయా కాలనీల్లో వీధి దీపాలు సరిగా వెలగటం లేదని, డ్రైనేజీ వ్యవస్థ సరిపోవటం లేదన్నారు. విద్యుత్ ఎక్కువ, తక్కువగా సరఫరా అవుతుందని, వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. మంచినీటి సరఫరా సమయం తగ్గించటంతో నీరు సరిపోవటం లేదని విచారం వ్యక్తం చేశారు. షేక్‌పేట రోడ్డులో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారిందని ప్రజలు పేర్కొన్నారన్నారు. ఆయా శాఖల అధికారులు సమస్యలను పరిష్కరించాలని కోరారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు ఎ.లక్ష్మణ్ రావు, బి. బాబు, మాల్యాద్రి నాయుడు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కిరణ్, బి.శ్రీధర్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధిలో ఆధునిక సాంకేతికత కీలకం



మాట్లాడుతున్న కుమార్ మొగులారం

చార్మినార్: పర్యాటక రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగమని ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ కుమార్ మొగులారం అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీస్ వంటి ఆధునిక సాంకేతికను వినియోగించి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తే లక్షలాది ఉద్యోగావకాశాలు సృష్టించవచ్చన్నారు. ప్రభుత్వ సిటీ కాలేజీ, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జీవితంలో ఒత్తిడులు తట్టుకోవడానికి, ఆధ్యాత్మిక భావనలతో, ప్రకృతి సౌందర్యాభిలాషతో పర్యటకులు వివిధ ప్రాంతాలను సందర్శిస్తారన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న ఉస్మానియా విశ్వ విద్యాలయం కామర్స్ డీన్ ఆచార్య కృష్ణ చైతన్య మాట్లాడుతూ..గత దశాబ్ద కాలంలో తెలంగాణలో అనేక చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలు దేశవ్యాప్తంగా పర్యటకులను ఆకర్షిస్తున్నాయని, నూతన పర్యటక విధానంతో హోటల్స్, మోటల్స్, ట్రాన్స్ పోర్ట్ తదితర రూపాలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన డా.నీరజ మాట్లాడుతూ..వందేళ్ల చరిత్ర కలిగిన చారిత్రక కట్టడంలో ఉన్న సిటీ కాలేజీలో పర్యటక రంగంపై సదస్సు నిర్వహించడం ఔచిత్యవంతంగా ఉందన్నారు. కామర్స్ విభాగం అధ్యక్షుడు డా.కె.మల్లికార్జునరావు, కన్వీనర్ డా.ఝాన్సీ రాణి, లలిత చైతన్య, డా.శిరీష, ఇఫత్ ఉన్నీసా, డా. రవీంద్రబాబు, సైదులు పాల్గొన్నారు.

మజ్లిస్ నాయకులు క్రియాశీలకంగా ఉండాలి



మజ్లిస్ సీనియర్ నాయకులతో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: మజ్లిస్ నాయకులందరూ క్రియాశీలకంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీలోని తన కార్యాలయంలో కార్వాన్ నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మజ్లిస్ సీనియర్ నాయకులతో పాటు మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులు తమ తమ ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలని వాటిని తన దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలను పరిశీలిస్తుండాలన్నారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ మజ్లిస్ పార్టీ ఈ నెల 19న దారుసల్లాంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తుందని ఈ విషయంపై బాగా ప్రచారం చేయాలని ఆయన కోరారు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ సభకు నాయకత్వం వహించి ప్రసంగిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆలీముద్దీన్, అబ్బాస్ హుస్సేన్, మాజిద్‌ఖాన్, అబ్బు తదితరులున్నారు.